క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన

వత్సవాయి(పెనుగంచిప్రోలు): తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను మంగళవారం వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకుని తుఫాన్‌కు నష్టపోయిన పొలాల్లో పంట నష్టాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నమోదు చేస్తామని సిబ్బంది అంటున్నారు. వత్సవాయి మండలం గోపినేనిపాలెం, పెదమోదుగుపల్లి, చినమోదుగుపల్లి గ్రామాల్లో ఏఓ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బంది పంట పరిశీలన చేశారు.

కేవీఆర్ లో ఫ్రెషర్స్ డే వేడుకలు

నందిగామ: పట్టణంలోని కాకాని వెంకటరత్నం కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రాయప్ప పర్యవేక్షణలో విద్యార్థులు నూతనంగా కళాశాలకు వస్తున్న విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత 55 సంవత్సరాలుగా ఈ కళాశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ సన్మార్గంలో నడుస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

మాక్ పోలింగ్‌పై అవగాహన సదస్సు



చిల్లకల్లు (జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం మాక్ పోలింగ్‌పై జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సూర్యారావు ఈవీఎం మిషన్ల పనితీరు, ఓటు వేసే విధానం తదితర వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన వారు ఎలక్ట్రానిక్ ఓటింగ్ వేసే విధానంలో ఈవీఎంలపై అవగాహన ఉండాలన్నారు. ఈ మాక్ పోలింగ్ లో 150 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఉపేంద్ర, వీఆర్ఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం



జగ్గయ్యపేట అర్బన్:భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాల మేరకు జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సూర్యారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎస్ఆర్ 2024లో వచ్చిన వివిధ రకాల అర్జీలపై తీసుకోనున్న చర్యల గురించి విస్తృతంగా చర్చించి తగు సూచనలు చేశారు.

ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు : 8 మందికి గాయాలు

నందిగామ: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఆటోను ఢీకొనడంతో పలువురికి గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు సాయంత్రం సమయంలో విద్యార్థులను ఇళ్ల వద్ద దింపేందుకు వెళుతున్న క్రమంలో నందిగామ శివారు అనాసాగరం సమీపంలో అటుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో వెళుతున్న పలు గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

నందిగామటౌన్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులతో వైద్యారోగ్య సిబ్బంది మర్యాదగా నడుచుకోవటంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి నిరుపేదకు ప్రభుత్వాస్పత్రులలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, వైద్యారోగ్య సిబ్బంది సైతం అందుకనుగుణంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, సూపరింటెండెంట్ కేవీఎస్ సత్యనారాయణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో అభివృద్ధి పథంలో పాఠశాలలు

'వై ఏపీ నీడ్స్ జగన్' లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వీరులపాడులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలు సైతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. వీరులపాడు గ్రామంలో మంగళవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు కనీసం పట్టించుకోని ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.16వేల కోట్ల నిధులు వెచ్చించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. నిరుపేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తుంటే చంద్రబాబు, టీడీపీ నేతలు మాత్రం అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం దివాలా తీస్తుందని గగ్గోలు పెడుతున్నారని నిరుపేదలకు మంచి చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, జంగా కోటిరెడ్డి, మందూరి గోపి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేరకలపాడులో..



పేటలో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పార్టీ నాయకులు

కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, నాయకుడు వరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుకే జగన్ కావాలి

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రజలకు రానున్న రోజుల్లో కూడా మరింత మేలు జరగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో జగనన్న చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పట్టణంలోని 11 వ సచివాలయం పరిధి శివాలయం వీధిలో మంగళవారం సాయంత్రం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలోని 23, 24 వ వార్డులకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మెపల్లి నరేంద్ర తదితరులతో కలిసి ఆవిష్కరించారు. సచివాలయం వద్ద కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో చేసిన అభివృద్ధిని డిస్‌ప్లే బోర్డుల్లో, బ్రోచర్లలో చూపించే దమ్ము ఉన్న సీఎం జగన్ మాత్రమేనన్నారు. 11 వ సచివాలయం పరిధిలో రూ.14 కోట్ల మేర లబ్ధి పొందారని తెలిపారు. వార్డు కౌన్సిలర్ సాధుపాటి రాజు, పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దునాయక్, సచివాలయ కన్వీనర్ దుర్గా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి

- ఫలించిన ప్రభుత్వ విప్ ఉదయభాను కృషి
- త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: దశాబ్దాల కాలంగా తీరని కలగా మిగిలిపోయిన పశ్చిమ కృష్ణా జిల్లా వాసుల స్వప్నం త్వరలో నెరవేరనుంది. కృష్ణా–గుంటూరు జిల్లాలను కలుపుతూ బ్రిడ్జి ఏర్పాటైతే తమ అవస్థలు తొలగిపోతాయని ఈ రెండు జిల్లాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా–పల్నాడు జిల్లాలుగా మారిన ఈ ప్రాంతంలోని కృష్ణా నది తీర ప్రాంత ప్రజలకు కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణం వలన ఎంతో మేలు జరుగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చొరవతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ముక్త్యాల వద్ద కృష్ణా నదిపై సుమారుగా రూ.60 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన ఇరు జిల్లాలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానుల్లో ఒకటైన అమరావతికి వెళ్లాలంటే సుమారు 80 కి.మీ దూరం తగ్గనుంది. వ్యాపారానికి ప్రసిద్ధి అయిన జగ్గయ్యపేట ప్రాంతం జాతీయ రహదారికి అనుసంధానం కాకపోవడంతో అభివృద్ధిలో, గుర్తింపులో వెనుకబడిఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పేటకు మరింత వన్నె రానుంది. వ్యాపారపరంగా విస్తృతమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి రాయలసీమ జిల్లాలకు కూడా దూరం తగ్గనుంది. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఎన్నాళ్ల నుంచో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తి అవడంతో బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం అయింది. దీంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలపై 19, 20 వార్డులకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఆ నిధులతో వార్డుల్లో ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. నందిగామ పట్టణాన్ని ఇప్పటికే అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సాంకేతిక లోపం కారణంగా పలు పథకాలు అందటం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని అటువంటి సమస్యలను తక్షణమే పరిష్కరించి సంక్షేమ పథకాలు అందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు మందా మరియమ్మ, వెంకట కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కరి రవీంద్ర, చాపల మల్లికార్జునరావు, కమిషనర్ జయరాం, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు

గడపగడపలో మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాత్రం సంక్షేమ పథకాలే అర్హుల ఇళ్ల వద్దకు వస్తున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వార్డులో పర్యటించిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పూర్తి నిరాదరణకు గురయ్యారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని సైతం కట్టబెట్టి సముచిత స్థానం కల్పించారన్నారు. ఆయా వర్గాల వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా సంక్షేమ పథకాలు అందించి అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో సైతం అండగా ఉండి పూర్తి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు గంగమ్మ, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు బండారు వెంకట్రావ్, శేషు, షఫీ, మున్సిపల్ కమిషనర్ జయరాం, పలువురు నాయకులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయంలో సోషల్ మీడియా ప్రధాన పాత్ర

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాధించిన భారీ విజయంలో సోషల్ మీడియా వారియర్స్ ప్రధాన పాత్ర పోషించారని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ అన్నారు. పట్టణంలోని శ్రీకరం కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు చేయకుండా ఒకటికి రెండు సార్లు ముందుగానే పరిశీలించుకుని పోస్ట్ చేయాలని సూచించారు. సమావేశంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చైతన్య రెడ్డి, కో కన్వీనర్‌లు మచ్చా శ్రీనివాసరెడ్డి, గద్దె రమేష్, మండల కన్వీనర్‌లు, పెద్ద సంఖ్యలో వారియర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు భోజన పళ్లాలు వితరణ

నందిగామ(చందర్లపాడు): మండలంలోని కోనాయపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం భోజన పళ్లాలను వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన నాగినేని శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా ఆయన కుమార్తెలు శ్రీదేవి, లీలారాణి రూ.5 వేల విలువచేసే 70 భోజనం ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

99 శాతం హామీలు అమలు

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గ్రామంలో మంగళవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటంతో పాటు కులమతాలకు అతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. ముఖ్యంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దే ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ఆదిమళ్ల ముత్యాలు, నాయకులు బజారు సాయి, బైరబోయిన బాబు, వీరబాబు, దారావాత్ దేవ్లా నాయక్, శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సాంబశివరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే అక్కసు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య షాదీఖానా నిర్మాణం విషయమై కావాలని ముస్లింలను రెచ్చగొడుతున్నారని పలువురు ముస్లిం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పలువురు మైనార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మున్సిపల్ స్థలంలో కౌన్సిల్ ఆమోదంతో పట్టణంలోని శాంతినగర్‌లో రూ.70 లక్షలతో 29 సెంట్ల స్థలంలో షాదీఖానా నిర్మిస్తున్నారని తెలిపారు. ఇది పూర్తయితే ఎమ్మెల్యే ఉదయభానుకు ఎక్కడ మంచిపేరు వస్తుందోననే ఆందోళనలో టీడీపీ వారు ఉన్నారని తెలిపారు. ఒకప్పుడు పట్టణంలోని జామియా మసీదు, ఈద్గా ఎలా ఉన్నాయో, ఇప్పుడెలా ఉన్నాయో గుర్తెరిగి మాట్లాడాలన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను తన సొంత నిధులతో ఈద్గాను చదును చేయించి 250 మామిడి చెట్లను నాటించారని, సామినేని విమలాభాను ఫౌండేషన్ తరఫున రూ.6 లక్షలతో నమాజ్ కోసం చాపలను ఇప్పించారని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, షాదీఖానా ప్రెసిడెంట్ ఎక్బై స్డ్ బాషా, జామియా మసీద్ ప్రెసిడెంట్ షేక్ జలీల్, మైనార్టీ నాయకులు షేక్ సయ్యద్‌ఆలీ, రహంతుల్లా, అల్లాభక్షు, షేక్ సేదా, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నందిగామటౌన్: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని ఆరవ వార్డులో స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరవ వార్డులో రూ.60 లక్షల వ్యయంతో అత్యాధునిక టెక్నాలజీతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న మురుగు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ యాకుబ్ అలీ, షేక్ కరీమ్, కమిషనర్ జయరాం పాల్గొన్నారు.

కేవీఆర్ కళాశాల విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, పీడీ

నందిగామ: కృష్ణా యూనివర్సిటీ అథ్లెటిక్స్ మీట్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం కేవీఆర్ కళాశాల నిర్వాహకులు అభినందించారు. ఈనెల 9 నుంచి 11 వ తేదీ వరకు ఉయ్యూరులో కృష్ణా యూనివర్సిటీ అథ్లెటిక్స్ మీట్ జరిగింది. ఈ పోటీలలో ఐదు కిలోమీటర్ల నడక పోటీలో నందిగామ కేవీఆర్ కళాశాల విద్యార్థిని సీహెచ్ భవాని బంగారు పతకాన్ని సాధించింది. పది కిలోమీటర్ల రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో నాగ పవన్ కుమార్ వెండి పతకాలు సాధించాడు. పి.సూర్య ప్రకాష్ ఐదు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించాడు. టి మౌనిక, పి శిరీష 20 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలలో వెండి పతకాలు సాధించారు. కె.రేవతి ఐదు కిలోమీటర్ల నడక పోటీలలో కాంస్య పతకం సాధించింది. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయప్ప, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, గేమ్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

శాస్త్రోక్తంగా ముక్తేశ్వరునికి లక్ష పత్రి పూజ



పేటలోని డాంగేనగర్‌లో బాలాంజనేయస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం



ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న భవానీ ముక్తేశ్వర స్వామి వారికి కార్తిక మాసం సందర్భంగా మంగళవారం లక్ష పత్రి పూజను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష తులసీ దళాలతో ముక్తేశ్వరునికి అర్చకులు సాంబశివరావు, కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కేసీపీ ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

పట్టణంలోని బ్రాహ్మణ బజారులో ఉన్న అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి భక్తులు అన్నాభిషేకం నిర్వహించారు. 11 కిలోల అన్నంతో అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తిక పూజలు

జగ్గయ్యపేటఅర్బన్: కార్తిక అమావాస్య సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని డాంగే నగర్‌లో శ్రీపంచముఖ బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మూడు నామాలతో కూడిన శంఖు చక్రాలు, ఓంకార ఆకారంలో కార్తిక దీపాలు వెలిగించి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

తొర్రగుంటపాలెంలో అయ్యప్ప పడిపూజ

తొర్రగుంటపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామికి 18 కలశాల పూజ, పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందిగామ: ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం నందిగామ పట్టణంలోని డీవీఆర్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్ (49) ఈనెల తొమ్మిదవ తేదీన నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటిపై నీరు పెడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి కింద పడ్డాడు. అప్పటినుంచి విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దశాబ్దాల కల సాకారం

- లంకభూముల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ
- 120 మందికి 99.15 ఎకరాలు



కొత్తపేటలో జేసీతో కలిసి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల(వీరులపాడు): కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక భూములకు సబ్ డివిజన్ చేసి ఇప్పటివరకు లంక భూములపై ఎటువంటి ఆధారం లేని వారికి పట్టాలు పంపిణీ చేసి ఏళ్ల నాటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామంలోని లంక భూములకు సంబంధించిన పట్టాలను జేసీ సంపత్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ లంక భూములపై ఎటువంటి ఆధారం లేని వారికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి హక్కు కల్పించిందన్నారు. రాజకీయ, కుల, మత, వర్గాలకతీతంగా ప్రతి ఒక్క సభ్యునికి వ్యక్తిగత పట్టాలు పంపిణీ చేశామన్నారు. మూడు కేటగిరీలలో లంక భూములను సాగు చేసుకుంటున్న అనేక మంది రైతులకు పట్టాలు లేవని, తమకు పట్టాలివ్వాలని ఎన్నో ఏళ్లుగా పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విషయాన్ని వివరించగానే సానుకూలంగా స్పందించటమే కాకుండా త్వరితగతిన పట్టాలు అందించారని గుర్తు చేశారు. పట్టాలు అందని లబ్ధిదారులను గుర్తించి త్వరలోనే వారికి కూడా పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

120 మందికి పట్టాలు పంపిణీ

కొత్తపేట గ్రామంలోని 99.15 ఎకరాలలోని లంక భూములకు సంబంధించి 120 మంది లబ్ధిదారులకు లీజు పట్టాలు పంపిణీ చేశామని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సన్నచిన్నకారు రైతులకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి వారికి ఎంతో మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ పత్తిపాటి సునీత, పత్తిపాటి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.